క్లుప్తంగా

చెట్ల నరికివేతపై అనుమానాలు



సరిపల్లి సమీపంలో చెరువు గట్టుపై నరికిన చెట్లు

కొయ్యలగూడెం: మండలంలోని సరిపల్లి సమీపంలో వడ్ల రామయ్య చెరువు గట్టుపై చెట్ల అక్రమ నరికివేత వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇటీవల చెట్ల నరికివేతను వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఆందోళన చేసిన విషయం విధితమే. చెట్ల అక్రమ నరికివేతపై సంబంధిత అధికారులకు ముందుగానే సమాచారం ఉన్నా పట్టించుకోలేదని దీంతో 40కి పైగా భారీ వృక్షాలు నరికేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఓ ప్రభుత్వాధికారి కీలకంగా వ్యవహరించారని ఆయన కన్నుసన్నలలోనే ఈ వ్యవహారం జరిగిందని ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తి విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వంట సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ గిరి భగవాన్ దాస్

కుక్కునూరు: మండలంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న వంట మనుషులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. మండలంలో మధ్యాహ్న భోజనం నడుపుతున్న పాఠశాలలో 61 ఉన్నాయి. వాటిలో వంట చేస్తున్న వర్కర్లకు జూన్ 12 నుంచి స్కూలు తెరవపడతాయని నూతన మెనూ విధానం ప్రకారం వండాలని మండల విద్యాశాఖ అధికారి గిరి భగవాన్ దాస్ తెలిపారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ వాహిద పఠాన్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ శ్యాం ప్రసాద్ బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఫలసాయం సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమ

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం నిమిత్తం మండలంలోని పెద్దరావి గూడెం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో ప్రభుత్వం సేకరించిన భూమిలో ఉన్నా మామిడి తోట ఫలసాయాన్ని అమ్మగా వచ్చిన సొమ్మును కుక్కునూరు తహసీల్దార్ ప్రభుత్వ ఖజానాకు డిపాజిట్ చేశారు. కాగా పరిహారం చెల్లించిన భూమి ప్రభుత్వానిదైనా అందుకు సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తులు ఫలసాయాన్ని కోసి ప్రతి ఏడాది సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై అప్పటి అధికారులకు స్థానిక గిరిజనులు చెప్పిన పట్టించుకోలేదు. కాగా ఇటీవల కొత్తగా వచ్చిన తహసీల్దార్ అచ్యుతా కుమారి ఈ ఏడాది మామిడి పండ్లను ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అంచనా వేయించి పండ్లను అమ్మి ఖర్చులు పోను మిగిలిన సొమ్ము రూ 31,900లను ప్రభుత్వ ఖజానాకు చలానా రూపంలో చెల్లించారు.

నేడు లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

లింగపాలెం: లింగపాలెం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గురువారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

టి.నరసాపురం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన జోనుబోయిన వెంకట శివాజీ గత నెల 10వ తేదీన ఇంటి వెళ్లిపోయాడన్నారు. ఎలాంటి సమాచారం లేకపోవడంతో అప్పటి నుంచి కుటుంబసభ్యులు శివాజీ కోసం గాలిస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో గురువారం శివాజీ తండ్రి ధర్మయ్య పోలీసులను ఆశ్రయించాడు.

వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇప్పించాలి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో వృద్ధులు, వితంతవులు, వికలాంగులకు బ్యాంకుల ద్వారా కాకుండా వలంటీర్లు లేదా సచివాలయం ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకుల ద్వారా పింఛన్లు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

వేగంగా ఆర్‌బీకే భవన నిర్మాణాలు

- చింతలపూడి నియోజకవర్గంలో 75 భవనాల నిర్మాణం
- ఇప్పటికే 42 భవనాలు పూర్తి
- భవనాల నిర్మాణాలకు రూ. 16.35 కోట్ల మంజూరు



చింతలపూడి మండలం రాఘవాపురంలో నిర్మించిన ఆర్‌బీకే భవనం

జంగారెడ్డిగూడెం: రైతులకు మెరుగైన సేవలు అందించి వ్యవసాయాన్ని పండుగ చేసేలా జగనన్న ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొనేవారు. పెట్టుబడులు లేక, పండించిన పంటను సరైన గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక, వ్యవసాయంలో సరైన ప్రోత్సాహకం లేక రైతులు నీరసించిపోయారు. కొంతమంది వ్యవసాయాన్ని వదులుకుని వేరే పనుల వైపు తరలిపోగా, కొంత మంది భూములను అమ్ముకునే స్థితికి చేరుకున్నారు. ఇలాంటి తరుణంలో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రైతులను బిడ్డల్లా సాకుతున్నారు.

రైతులను రాజులను చేస్తూ...

రైతే రాజు అనే పదానికి న్యాయం చేసేలా వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సాంకేతికతను మిళితం చేస్తూ ఆర్‌బీకే వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)లను ఏర్పాటు చేసి రైతులకు సేవలను క్షేత్రస్థాయిలో అందిస్తున్నారు. విత్తు మొదలుకుని పంట అమ్ముకునేంత వరకు రైతుకు అవసరమైన అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యాంత్రీకరణ పరికరాలు, వ్యవసాయ సలహాలు, సూచనలు, వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన, మట్టి నమూనాల సేకరణ, ల్యాబ్‌ల్లో పరీక్షలు, రైతు భరోసా, పంటల బీమా, పంటల నష్ట పరిహారం సీసీఆర్‌సీ కార్డులు తదితర ఎన్నో సేవలను గ్రామస్థాయిలోనే ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించేందుకు నిర్దేశించింది. ఇందుకోసం ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఆర్‌బీకే భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది.

నిర్మాణాలు ఇలా

చింతలపూడి నియోజకవర్గం వ్యాప్తంగా 75 ఆర్‌బీకేలను నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణ పనులను ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టి పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. ఒక్కొక్క ఆర్‌బీకే భవనం నిర్మాణానికి రూ.21.80 లక్షలు వెచ్చిస్తున్నారు. నియోజకవర్గంలో 75 ఆర్‌బీకే భవనాలకు రూ.16.35 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 42 భవనాలు పూర్తికాగా, కొన్ని భవనాలు ప్రారంభించి సేవలు అందిస్తున్నారు. మిగిలిన భవనాలన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ఆర్‌బీకేల వివరాలు:	
నిర్మిస్తున్న మొత్తం భవనాలు	75
నిర్మాణం పూర్తయినవి	42
తుది దశలో ఉన్నవి	10
శ్లాబ్ దశలో ఉన్నవి	5
రూఫ్ స్థాయికి చేరుకుని	14
బేస్‌మెంట్‌స్థాయిలో ఉన్నవి	3
నిర్మాణం ప్రారంభం కానివి	1

సాగు పరిష్కార వేదికలు

ఆర్‌బీకేలు సాగు పరిష్కార వేదికలుగా నిలుస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలతో రూపుదిద్దుకున్న ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయ గ్రంథాలయాలుగా ఆర్‌బీకేలు మన్ననలు పొందుతున్నాయి. రైతులకు విత్తు నుంచి పంట అమ్మకాల వరకు ఒకే చోట పరిష్కారం లభించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగులో మెళకువలు, శాస్త్రవేత్తల సలహాలు, కొనుగోలు కేంద్రాలు ఇలా అన్ని వసతులు ఇక్కడ ఏర్పాటు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ఘన విజయం సాధించారు. ఈ క్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలకు సొంత భవనాలు సైతం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుంది.

ఘనంగా హనుమద్ జయంత్యుత్సవాలు

టి.నరసాపురం: మండలంలోని వెంకటాపురంలో హనుమద్ జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గత మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తుండగా, గురువారం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అలాగే ఆలయంలో హనుమాన్ చాలీసా పఠించారు.

జూన్ 1న హనుమద్ జయంతి

జూన్ 1 హనుమద్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని బండిరేవు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కె.మోహన్‌కుమార్, రాజ్యలక్ష్మి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరపనున్నామన్నారు. అలాగే అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారమని, అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

చెస్ పోటీల్లో జంగారెడ్డిగూడెం బాలిక ప్రతిభ



చెస్ టోర్నమెంట్‌లో బహుమతి అందుకుంటున్న మేడిచర్ల తన్మయి

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ ప్లేయర్ మేడిచర్ల తన్మయి ఇండియా ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంటులో విజేతగా నిలిచింది. నరసాపురంలో నిర్వహించిన ఏడవ నూలు సాయి అభయ్ మెమోరియల్ అండర్ 15 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించినట్లు దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ ఎ.సరళా మాధవి గురువారం విలేకరులకు తెలిపారు. విజేత తన్మయికి కోచ్ సరళమాధవి, సాహితీవేత్త తిప్పాబట్ల రామకృష్ణ మాస్టారు, రోటరీ సభ్యులు అయినపర్తి చంద్రశేఖర్, జవ్వాజి ఉమా వెంకటేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

అనాథలకు ఆపన్నహస్తం



అనాథకు స్నానం చేయిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి వద్ద రోడ్డు పక్కన కొంత కాలంగా ఉంటున్న అనాథకు హెయిర్ కటింగ్ చేయించి, నూతన వస్త్రాలు, ఆహారాన్ని అందించారు. అలాగే జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడికి సాయం చేశారు. హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు, హైస్కూల్ పీడీ జయరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల్, ప్రసాద్, రావికంపాడు ఫ్రూట్‌షాప్ సత్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో ఇబ్బందులు



నిర్మానుష్యంగా మారిన అశ్వారావుపేట రోడ్డులోని ప్రధాన రహదారి

జంగారెడ్డిగూడెం: భానుడి ప్రతాపం గురువారం ప్రజలను అల్లాడించింది. గత మూడు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో, వేసవి తాపాన్ని తాళలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో పట్టణంలో అత్యవసర పనులపై వచ్చే వారు తప్ప, మిగిలిన వారు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఉదయం 11 గంటలయ్యేసరికి పట్టణంలో కర్ఫ్యూ వాతావరణంతో కనిపిస్తోంది. వ్యాపార సముదాయాలు సైతం వినియోగదారులు లేక పోవడంతో వెలవెలబోతున్నాయి. సాయంత్రం 6 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. రాత్రి సైతం ఉక్కబోతే ఉండడంతో ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, పెద్దలు ఎండ తీవ్రతకు బాగా ఇబ్బంది పడుతున్నారు. మరికొద్ది రోజులు వాతావరణం ఇలాగే ఉండే పరిస్థితి ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బాటసారులు చలివేంద్రాలు, శీతలపానీయాలను ఆశ్రయిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం సుమారు 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 6 గంటలకు 39 డిగ్రీలతో వేడి తీవ్రతలో మార్పు రాలేదు. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లు పెద్దగా జనసంచారం లేకుండా కనిపించాయి.

వైభవంగా జెండారో ఉత్సవం



కృష్ణాపురంలో బంజారా భజరంగి భేరి ఆధ్వర్యంలో జెండారో ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలో బంజారా బజరంగీ భేరి నాయకత్వంలో జెండారో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నాయకుడు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆత్మ గౌరవానికి, జాతి అస్తిత్వానికి, నాయకుడి ప్రతిష్టకు జెండా అనేది ఒక గుర్తు అని, అందుకని ప్రతి తండాలో జెండాను ఎగరేసి ఉత్సవంగా జరుపుకోవడం చాలా గొప్ప సంప్రదాయంగా వస్తుంది అని అన్నారు. ప్రపంచ ప్రాచీన ధర్మాల్లో బంజారా ధర్మం గొప్పదని అన్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి వేణు నాయక్ మాట్లాడుతూ బంజారాలు తమ గ్రామాన్ని, తమ పంటలను, జీవరాశులను కాపాడే మేరామా, సీతలా, తుల్జా అనే భవానీలు కాపాడుతుంటారని అన్నారు. తమ తండావాసులతో పాటు మూగ జీవరాసులను కాపాడాలనే గొప్ప ధర్మం బంజారాలది అని అన్నారు. సంఘం నాయకత్వంలో ఏడు భవానీ, హథీరామ్, సేవాలాల్, హనుమాన్ జెండాలను తీన్మార్ డప్పులతో గ్రామమంతా ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ హనుమాన్ జెండాలను పంచారు. ఈ కార్యక్రమంలో చందా నాయక్, పూర్ణయ్య నాయక్, భిగనాదం నాయక్, వెంకా నాయక్, రమేష్ నాయక్, గాంధీ నాయక్, బంగారయ్య నాయక్, శ్రీనివాస్ నాయక్, వెంకటేశు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



కొయ్యలగూడెంలో సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న దృశ్యం



చింతలపూడిలో సిఐటీయు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం గురువారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. 54 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఇప్పటివరకు సీఐటీయూ సాధించిన విజయాలు పేర్కొన్నారు. కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్య చేసే వర్గ పోరాటాలను నిర్వహించే లక్ష్యంతో సీఐటీయు ఏర్పడిందని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శివకుమార్, కె.సీతారాములు, సీహెచ్ మరిడియ, సీహెచ్ సత్యనారాయణ, మిడ్ మీల్స్ సిహెచ్ లక్ష్మీకాంతం, వెంకన్న, త్రిమూర్తులు, తమ్మారావు, ఎ.సతీష్, రమేష్, సురేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలను చింతలపూడిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నత్తా వెంకటేశ్వరరావు, బాలరాజుల ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటీయు నాయకులు రామిశెట్టి సత్యన్నారాయణ, ఎస్ సూర్యకుమార్‌లు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సరోజిని, మాణిక్యం, సరళ, సెక్టార్ లీడర్స్, అరుణ , చెన్నకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: సీఐటీయు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం సంజయ్ నగర్ కాలనీ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ కార్మిక సంఘం ఐక్యతకు అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.నాగేంద్రరావు, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు షేక్ వలిపాషా, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పులదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్

పెదపాడు : మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో ఆర్డినేటర్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. పెదపాడు మండలంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ మేరకు ప్రతి ఏజన్సీ చర్యలు తీసుకోవాలని సూచించారు. భోజనం వండే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. వండిన వంటలను రుచి చూసి అభినందించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ జొన్నకూడి జయమ్మ, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, దేవినేని వెంకటరమణ, మండల రిసోర్స్ పర్సన్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌పై తీవ్ర ఉత్కంఠ

- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ
- విజయంపై ఎవరి ధీమా వారిది
- అంతు చిక్కని ఓటరు నాడి

ద్వారకాతిరుమల: సార్వత్రిక ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడడంతో అన్ని పార్టీల నాయకులు, పందెం రాయుళ్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎవరి నోట విన్నా.. ఎక్కడ చూసినా కౌంటింగ్ పైనే చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరు కలిసినా విజయం ఎవరిదనే అంశంపైనే విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. మరో పక్క జూన్ 4న కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 2019 ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా, వాటి ఫలితాల కోసం 41 రోజుల పాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకా కౌంటింగ్‌కు 4 రోజులు మాత్రమే గడువు ఉంది. ఇదిలా ఉంటే పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికీ పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాలు వేస్తున్నారు. ప్రజలు కౌంటింగ్ రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరో పక్క గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. పోటీల్లో నిలిచిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయావకాశాలు, వారి మెజారిటీలపైన, అధికారంలోకి ఏ పార్టీ వస్తుందనే దానిపై పందెంరాయుళ్లు భారీ బెట్టింగులు కడుతున్నారు.

సంక్షేమ పథకాలపైనే నమ్మకం

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 151 స్థానాలతో వైఎస్సార్ సీపీ చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఐదేళ్లలో కనీవినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఈసారి గెలుపు తమదేనన్న ధీమాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అర్ధరాత్రి వరకు వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓట్లు వేయడం వంటి పాజిటివ్ ఓటుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

కాల్స్‌తో విసిగిపోతున్న ప్రజలు

ఐవీఆర్ఎస్ వంటి కాల్స్‌తో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఎన్నికలయ్యాక ఎవరికి ఓటు వేశారో తెలుసుకోవడానికి కాల్స్ ఏంటి? అని చిరాకు పడుతున్నారు. వివిధ సంస్థలు చేసే కాల్స్‌కు ప్రజలు పెద్దగా సహకరించడం లేదు. మీరు ఏ పార్టీకి ఓటు వేశారు. ఎమ్మెల్యే ఓటు ఎవరికి వేశారు? ఎంపీ ఓటు ఎవరికి వేశారు? అని అడుగుతూ అందుకు చెప్పిన అంకెలు నొక్కండి అంటూ విసిగిస్తున్నారు. ఈ కాల్స్‌కు అతి తక్కువ మంది మాత్రమే స్పందిస్తున్నారు. దీంతో సర్వే సంస్థలకు, పందెం రాయుళ్లకు జనం నాడి చిక్కడంలేదు. మొత్తానికి అటు అభ్యర్థులకు, ఇటు పందేలు కాసే వారికి, మరోవైపు ఫోన్ సర్వేపై ఆధారపడిన వారికి స్పష్టత రావడం లేదు.

అభయాంజనేయస్వామికి లిల్లీ పూలతో పూజ



ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన



అభయాంజనేయస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు రామాచార్యులు

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి గురువారం 1008 లిల్లీ పూలతో పూజ చేశారు. తొలుత గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి భజన సమాజం రేమల్లే వారిచే నక్షత్ర హారతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దాతల సహకారంతో ప్రత్యేక ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంచారు. రాత్రి ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం రేడియో టీవీ ఆర్టిస్టు శివకుమార్ భక్తిగాన సుధ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా రంగారావు జయంతి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిళ్లంగోళ్ల రంగారావు 73వ జయంతిని పిళ్లంగోళ్ల రంగారావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక పత్తేబాద సెంటర్లో భోజనం, వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ దిరిశాల వరప్రసాద్ మాట్లాడుతూ రంగారావు స్ఫూర్తితో ఆయన కుమార్తెలు శ్రీలక్ష్మి, శ్రీదేవి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ తన తండ్రి రంగారావు ఆశయాలను కొనసాగించడమే తమ జీవిత లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి, నాయకులు పిల్లంగోళ్ల గిరి కుమారి, ఈదుప్పగంటి నవరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ ఖాతాలు తెరిపించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసి స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విలీనమైన వివిధ క్యాడర్ల ఉపాధ్యాయులకు ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ ఖాతాలు తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంకు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్ మినహాయింపు లేని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాలు నిలుపుదల కాకుండా చూడాలని కోరారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల నెలవారీ పదోన్నతుల ప్రక్రియను పునరుద్ధరించాలని, జనవరి నెల నుంచి జిల్లాలో కొందరు ఉపాధ్యాయుల పదవీతో వివిధ పాఠశాలల్లో ఏర్పడిన సబ్జెక్టు టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.